www.navatelangana.com

నవతెలంగాణ

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

సోమవారం 17 ఏప్రిల్ 2023

జీపీఎస్‌ల సమస్యల పరిష్కారానికి వినతి

నవతెలంగాణ-జన్నారం

జూనియర్ పంచాయతీల కార్యదర్శుల, సమస్యలను పరిష్కరించాలని ఆదివారం జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ గుప్తాకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులర్ చేయడం లేదన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎస్కే ఎజాజ్, శ్రీరాముల సరిత, గొల్ల శ్రీకాంత్, బాదావత్ భీంరావు, బానవత్ ప్రసాద్, గోదారి వినోద్ కుమార్, మేకల లావణ్య, శ్రీపెల్లి రమేష్, ఇస్లావత్ కరుణ, శెట్టిపల్లి మధుకర్, చొప్పదండి సాగర్, కళ్యాణి, హనుమండ్ల రమేష్ పాల్గొన్నారు

మండలంలో సాగిన బట్టీ పాదయాత్ర

నవతెలంగాణ-హాజీపూర్

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేస్తున్న హాత్ సే హాత్ జోడో పాదయాత్ర ఆదివారం మండలంలో సాగింది. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖలు పాల్గొన్న పాదయాత్రకు వేంపల్లి వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. గుడిపేట్‌లో స్థానికులు ఎల్లంపల్లి సమస్యలు, నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి సమస్యలు భట్టి దృష్టికి తీసుకెళ్లారు. సాయంత్రం గుడిపేట్ నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మీదుగా పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం అంతర్గామ వరకు సాగింది.



రెగ్యులర్ కోసం ఆరాటం..!

- ఉద్యోగాల క్రమబద్ధీకరణకు జేపీఎస్‌ల డిమాండ్
- ఈ నెల 11వ తేదీతో ముగిసిన ప్రొహిబేషన్ పీరియడ్
- సర్కారు నుంచి వెలువడని అధికారిక ఉత్తర్వులు
- ఈ నెల 28వ తేదీ నుంచి సమ్మెకు వెళ్లాలని నిర్ణయం

పల్లెల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రెగ్యులర్ కోసం ఆరాట పడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగేండ్ల ప్రొహిబేషన్ పీరియడ్ పూర్తికావడంతో సర్వీసు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారికంగా ఈ నెల 11వ తేదీ నాటికే ప్రొహిబేషన్ పీరియడ్ పూర్తికావడంతో ప్రభుత్వ జీఓ 26 ప్రకారం మరుసటి రోజు నుంచి గ్రేడ్-4 కార్యదర్శిగా పరిగణించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం ఇందు కోసం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమ సర్వీసు క్రమబద్ధీకరణపై దృష్టిసారించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందించారు. ఈ నెల 28వ తేదీలోపు స్పందించని యెడల విధులు బహిష్కరించి సమ్మెకు దిగుతామని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం వివరాలు సేకరించినప్పటికీ సర్వీసును రెగ్యులర్ చేయడంలో తాత్సారం చేస్తుండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పల్లెల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం ఊరికో పంచాయతీ కార్యదర్శిని నియమించింది. పల్లెల్లో చేపడుతున్న పనులను రోజువారీగా పర్యవేక్షించడం.. వాటి పురోగాభివృద్ధి కోసం పంచాయతీ కార్యదర్శుల నియామకం చేపట్టాలని భావించింది. ఇందులో భాగంగా నిర్వహించిన రాత పరీక్షలో ప్రతిభ కనబరిచి 2019 ఏప్రిల్ 12న జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించబడ్డారు. తొలుత నోటిఫికేషన్‌లో మూడేండ్ల ప్రొహిబేషన్ పీరియడ్‌గానే పరిగణించినా ప్రభుత్వం మరో ఏడాది పాటు ప్రొబేషన్ పీరియడ్‌ను పెంచి నాలుగేండ్లు చేసింది. ఈ నిబంధన ప్రకారం 2023 ఏప్రిల్ 11వ తేదీ నాటికి ప్రొహిబేషన్ పీరియడ్ పూర్తయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నెల 12వ తేదీ నుంచి వీరిని గ్రేడ్-4 కార్యదర్శిగా మార్చాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం ఈ విషయంపై దృష్టిసారించకపోవడంతో జేపీఎస్‌ల్లో ఆందోళన నెలకొంది. తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లకు ఈ నెల 13వ తేదీన వినతిపత్రాలు అందించారు. ఈ నెల 28వ తేదీ వరకు గడువు విధించారు. ఆలోపు సర్వీసు క్రమబద్ధీకరించాలని లేనిపక్షంలో విధులు బహిష్కరించి సమ్మెబాట పడుతామని అల్టిమేటం జారీ చేశారు.

పల్లెల అభివృద్ధిలో కీలకపాత్ర

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1485 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 882మంది జూనియర్ పంచాయతీ అధికారులు నియమితులయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో 283మంది, నిర్మల్‌లో 247మంది, మంచిర్యాలలో 181మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 171మంది జేపీఎస్‌లు పనిచేస్తున్నారు. తొలుత నాలుగేండ్ల పాటు ఆయా పల్లెల్లో విధులు నిర్వర్తిస్తేనే సర్వీసు క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. సర్కారు ఆదేశాల మేరకు పల్లెల్లో ఉపాధిహామీ, నర్సరీలు, తాగునీటి వసతి, పరిశుభ్రత, ఆసరా పింఛన్ల పంపిణీ, వివిధ పథకాలకు లబ్దిదారుల ఎంపిక, ఇంటిపన్ను వసూలు, జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీ, వీధి దీపాల నిర్వహణ ఇలా గ్రామంలో అవసరమయ్యే అన్ని రకాలు పనులు చేపడుతున్నారు. ఉదయం 6గంటలకే ఆయా పల్లెలకు వెళ్లి పనులను పర్యవేక్షిస్తూ వాటి అభివృద్ధికి దోహదం చేస్తున్నారు. గ్రామాలు, మండల కార్యాలయాలకు అనుసంధానంగా ఉంటూ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

ప్రభుత్వ ప్రయోజనాలు లేక అవస్థలు

పల్లెల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రెగ్యులర్ ఉద్యోగులు కాకపోవడంతో ప్రభుత్వ ప్రయోజనాలు దక్కడం లేదు. ఉద్యోగ గుర్తింపు కార్డు, సర్వీసు బుక్ లేకపోవడం, హెచ్ఆర్ వర్తించకపోవడం, ఆరోగ్యకార్డులు వంటి సౌకర్యాలకు దూరమవుతున్నారు. సర్వీసు క్రమబద్ధీకరణ లేకపోవడంతో పాత జీతాలే వస్తుండటంతో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఉద్యోగాలను రెగ్యులర్ చేయడంతో పాటు సర్వీసు బుక్‌లో ప్రొహిబిషన్ పీరియడ్‌ను నమోదు చేయాలని, గ్రేడ్-4 కార్యదర్శిగా అందజేయాల్సిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వీరి సమస్యలపై దృష్టిసారించకపోవడంతో గత్యంతరం లేక సమ్మెకు దిగాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 28వ తేదీలోపు ప్రభుత్వం స్పందిస్తే సరి..లేకుంటే విధులు బహిష్కరించి నిరసన చేపడుతామని పంచాయతీ కార్యదర్శులు స్పష్టం చేస్తున్నారు.

సర్వీసును క్రమబద్ధీకరించాలి

చంద్రశేఖర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం, జిల్లా అధ్యక్షుడు



జిల్లాలో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొహిబేషన్ పీరియడ్ పూర్తయింది. ప్రభుత్వం జీఓ 26 ప్రకారం ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి. ఈ నెల 11వ తేదీ వరకే గడువు ముగిసినా ఇంకా ఉత్తర్వులు జారీ చేయడం లేదు. రాష్ట్ర సంఘం సూచనల మేరకు జిల్లా కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందించాం. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 28 నుంచి సమ్మెకు వెళ్లాలని నిర్ణయించాం.

మంచిర్యాల జిల్లా వాసికి 'విశిష్ట సేవా రత్న' పురస్కారం.



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన గణముక్కుల మహేష్ ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన 'ఉగాది పురస్కారాలు' లో భాగంగా 'విశిష్ట సేవ రత్న' పురస్కారం కుటుంబ సమేతంగా అందుకున్నారు. ఈ అవార్డుని సెర్ప్ సీఈఓ ఎండీ ఇంతియాజ్, అంబెద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్పెషల్ ఆఫీసర్ వెలగ జోషి, దేవాదాయ శాఖ కమిషనర్ ఏ. సత్యనారాయణ పురస్కారాన్ని అందచేశారు. మహేష్ గత పది సంవత్సరాలుగా ఫోటో జర్నలిజంలో చేస్తున్న సేవలకు గాను ఈ గుర్తింపు లభించింది. ప్రస్తుతం మహేష్ టైమ్స్ అఫ్ ఇండియా ఆంగ్ల పత్రికలో సీనియర్ ఫోటో జర్నలిస్టుగా సేవలందిస్తున్నారు. గతంలో కూడా మహేష్ రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. ఈ పురస్కారాలను 'జయహో భారతీయం' 'తెలంగాణ అసోసియేషన్ అఫ్ సౌత్ ఆఫ్రికా' వారు ప్రధానం చేశారు.

ఐకేపీ వీఓఏల రాష్ట్ర వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి

- సంఘం మండల అధ్యక్షుడు ఎస్.బుద్దు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

న్యామైన డిమాండ్ల పరిష్కారానికి సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఐకేపీ వీఓఏల సమ్మెను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎస్.బుద్దు అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఉద్యోగభద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26000 చెల్లించాలన్నారు. ఐడీ కార్డు గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వ్యక్తిగత ఖాతాలో వేయాలని అన్నారు. తమతో ఆన్‌లైన్ పనులు చేయించకూడదని, అర్హులైన వీఓఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని తమ సమస్యలు పరిష్కరించాలని చేపడుతున్న సమ్మెను వీఓఏలు విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సంఘం మండల కార్యదర్శి జ్యోతి, నాయకులు రమ, సునీత, శ్రీలత, అర్చన, పద్మ రాధ, శారద, కవిత, జయ, ఓమాజీ లక్ష్మి పాల్గొన్నారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980-81 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 42 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేడుకలు ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రేమ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ రకాల కార్యక్రమాలతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసేలా కార్యక్రమాలు ఆద్యంతం ఉత్తేజం నింపాయి. ఈ సందర్భంగా గురువులు హరిచందర్ రావు, సత్యమూర్తి, జగదీశ్వర్, కిష్టయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా తమ విద్యార్థులను మరోసారి కలుసుకునే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండడమే గురువులకు గొప్ప గౌరవమని తెలిపారు. తమ ద్వారా విద్య నేర్చుకుని ఉన్నత స్థానాలు సంపాదించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల కిందటి తన స్నేహితులను మరొకసారి కలుసుకునే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు. మరణించిన తోటి విద్యార్థులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మంతెన మహేష్, మరియాల ఉదయభాబు, రఫీక్, చంద్రశేఖర్, పిన్న వివేక్, తిరుమలరావు, సాయిని నరసింహులు, శివప్రసాద్, బక్కయ్య, నవీన్, రావుల మురళి, సుగుణాకర్, సంధ్య, రాజేశ్వరి పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడి నియామకం

నవతెలంగాణ-జన్నారం

స్వర్ణకారుల సంఘం మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలం కేంద్రానికి చెందిన శ్రీరాముల వెంకటేష్ నియమితులయ్యారు. నియామక పత్రాన్ని ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆ సంఘం, జిల్లా అధ్యక్షులు ధర్మవరం బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి మునిగంటి హనుమయ్య చార్యులు అందించారు. స్థానికంగా స్వర్ణకారులకు విశేష సేవలు అందించినందుకు గాను ఇతనిని జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామల వెంకటేష్ మాట్లాడుతూ స్వర్ణకారుల హక్కుల కోసం పోరాటం చేస్తూ స్వర్ణకారుల ఐక్యత కోసం తమ వంతు సహకారం అందిస్తామన్నారు. స్వర్ణకారులంతా ఐక్యంగా ఉండి పోరాటం చేస్తేనే హక్కులు సాధించుకోవచ్చు అన్నారు. తనను ఈ పదవికి నియమించినందుకు గాను జిల్లా, మండల స్వర్ణకారుల సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్ధరాత్రి దాటిన తర్వాత తొలగిన వివాదం

- అదనపు కలెక్టర్ హామీతో ఆందోళన విరమించిన విద్యార్థిని బంధువులు
- తమ కూతురిని హైద్రాబాద్‌కు ఎందుకు తీసుకువెళ్లారని ప్రశ్నించిన తండ్రి
- హౌజ్ మేడమ్‌ను విధుల నుండి తొలగించిన అధికారులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల (సిర్పూరు టి)లో 9వ తరగతి విద్యార్థిని శ్రీవాణి మృతి చెందిన సంఘటనలో అర్ధరాత్రి దాటిన తర్వాత వివాదం సద్దుమనిగింది. తీవ్ర అస్వస్థతకు గురై విద్యార్థిని శనివారం మృతి చెందిన విషయం తెల్సిందే. విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్, హౌజ్ మేడమ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టగా ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల వరకు కొనసాగింది. అర్ధరాత్రి 12 గంటలకు అదనపు కలెక్టర్ రాజేశం వచ్చి బంధువులకు సర్దిచెప్పినా వారు వినలేదు. కళాశాల ప్రిన్సిపల్‌ను, హౌజ్ మేడమ్‌ను తమ ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేయగా పోలీసు బందోస్తు మధ్య వారిని బయటకు తీసుకువచ్చారు. వారు కళాశాలలో, ఆసుపత్రిలో జరిగిన విషయాన్ని బంధువులకు చెప్పడంతో వారు తీవ్రంగా ఆగ్రహించారు. తమ కూతురు శ్రీవాణిని మూడు సార్లు హైద్రాబాద్ తీసుకువెళ్లారని, ఎందుకు తీసుకువెళ్లారో చెప్పాలని తండ్రి సమ్మయ్య ప్రశ్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో ప్రిన్సిపల్‌ను తిరిగి ఆస్పత్రిలోనికి పంపించారు. అనంతరం రాజేశం విద్యార్థిని బంధువులతో మాట్లాడారు. తల్లిదండ్రులు రాతపూర్వంగా ఇస్తే కళాశాల నిర్వాహకులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇవ్వడంతో విద్యార్థిని కుటుంబసభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, నష్టపరిహారం ఇవ్వాలని, కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, కూతురిని హైద్రాబాద్ ఎందుకు తీసుకువెళ్లారో విచారణ జరపాలని తండ్రి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాత్రి 2 గంటల సమయంలో తల్లిదండ్రులు, బంధువులు మృతదేహాన్ని మంచిర్యాల ఆస్పత్రికి తీసుకువెళ్లి అక్కడ పోస్టుమార్టం నిర్వహించిన ఆదివారం ఉదయం వారి స్వగ్రామం కోటపల్లి మండలం రావులపల్లికి తరలించారు.

హౌజ్ మేడమ్ విధుల నుండి తొలగింపు

బాలిక మృతి ఘటనకు బాధ్యురాలిని చేస్తూ కళాశాల హౌజ్ మేడమ్ మమతను విధుల నుండి తొలగించినట్లు ఆర్‌సీఓ స్వరూపారాణి తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెను విధుల నుండి తొలగించామని, ఈ ఘటనపై విచారణ కొనసాగుతున్నందున ఆమె విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని ఆర్‌సీఓ తెలిపారు.

రంజాన్ తోఫా పంపిణీ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణం లోని స్థానిక బీ జోన్ మేరాజ్ మజీద్, జమియా మసీదులో సుమారు 100 మంది ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను ఆదివారం పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అందజేశారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. అన్ని వర్గాలకు సమ ప్రదాన్యత ఇస్తూ పండగలు ఘనంగా నిర్వహించుకునేల చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ సాగర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుదర్శన్ గౌడ్, కౌన్సిలర్లు, యువజన విభాగం నాయకులు సత్యపాల్, చంద్రకిరణ్, కొండ కుమార్, దేవీ సాయిక్రిష్ణ, మెరుగు సతీష్, పట్టణ ముస్లిం కమిటీ సెక్రటరీ డా.సలీం, జామియా మసీదు అధ్యక్షులు ఎండీ షఫీ భాయ్, మెరజ్, ఇజాజ్, జమీర్, షబ్బీర్, పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ తోఫాను ఆదివారం స్థానిక బజార్‌వాడీ, సందీప్‌నగర్ కాలనీల్లో బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సాలం, మాజీ వార్డు సభ్యుడు షబ్బీర్‌లు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభివృద్ధి కోసం తోడ్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎండీ అహ్మద్, ఎండీ తాజ్, నజీర్, ఎండీ ఇమ్రాన్, షాహిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

'బిడ్డా...ధైర్యంగా ఉండు.. నేనొస్తున్నా...'

- బాలిక మృతికి పది నిమిషాల ముందు ఫోన్‌లో మాట్లాడిన తల్లి
- 'సరే'నమ్మా అన్న పదినిమిషాలకే బాలిక మృత్యువాత
- ఆర్‌ఓబి పూర్తి కాకపోవడం, కాగజ్‌నగర్‌లో కళాశాల లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమా!



నవతెలంగాణ-కాగజ్‌నగర్

'బిడ్డా భయపడకు.. ధైర్యంగా ఉండు, నేనొస్తున్నా' అని కూతురితో మాట్లాడిన పది నిమిషాలకే ఆ కూతురు మృత్యువాత పడితే ఆ కన్నతల్లి కడుపు శోకం ఎలా ఉంటుంది. కాని ఇక్కడ దురదృష్టం ఏమిటంటే మనల్ని పాలించే పాలకులకు ఆ కన్నతల్లి కడుపుశోకం అర్థం కావడం లేదు. సిర్పూరు (టి) సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల విద్యార్థిని శ్రీవాణి మృతి చెందడానికి పది నిమిషాల ముందే తల్లి లలితతో ఆ విద్యార్థిని మాట్లాడింది. బిడ్డా ఏమైంది నీకు అని తల్లి అడిగితే కాళ్లు నొప్పున్నాయని సమాధానం చెప్పిన కూతురు నీరసంగా సమాధానం చెప్పడాన్ని గ్రహించిన తల్లి బిడ్డా ధైర్యంగా ఉండు, నువ్వు టెన్షన్ పడి మమ్మల్ని టెన్షన్ పెట్టకు, బాంచన్ కాల్మొక్తా అన్న తల్లికి సరేనని సమాధానమిచ్చిన పది నిమిషాలకే ఆ బాలిక మృత్యువాత పడడం ఆ తల్లిని కలిచివేసింది. తన బిడ్డను మంచిర్యాల ఆసుపత్రికి తీసుకువస్తున్నారని తెలిసి అప్పటికే మంచిర్యాలకు వచ్చి ఉన్న శ్రీవాణి తల్లిదండ్రులు ఎస్ సమ్మయ్య-లలితలు తన బిడ్డ మృతి చెందిందని, కాగజ్‌నగర్‌కు రావాలని సమాచారం అందడంతో వారు భోరున రోదించారు. కాగజ్‌నగర్‌కు వచ్చిన తల్లి ఆసుపత్రి ముందు ఆటో దిగడంతోనే అక్కడే కుప్పకూలి భోరున రోదిస్తూ సొమ్మసిల్లి పడిపోవడం పలువురి హృదయాలను కలిచివేసింది.

అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యమే...

విద్యార్థిని శ్రీవాణి మృతికి అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఈ నెల 13 నుండి విద్యార్థిని అస్వస్థతకు గురి కాగా సకాలంలో ఆమె వ్యాధిని గుర్తించి పెద్దాసుపత్రికి తరలించాల్సిన కళాశాల సిబ్బంది కానీ, అక్కడి వైద్యులు కాని ఆ దిశగా చర్యలు చేపట్టలేదు సిర్పూరు (టి)లో ఆసుపత్రి వద్ద అంబులెన్స్‌లో కాగజ్‌నగర్‌కు తీసుకువచ్చే సమయంలో తల్లితో ఫోన్‌లో మాట్లాడిన బాలికను సకాలంలో కాగజ్‌నగర్‌కు తీసుకువస్తే పరిస్థితి మరోలా ఉండేది కావచ్చు. మార్గమధ్యలో రైల్వే గేటు ఉండడం, అక్కడ అదే సమయంలో రెండు రైళ్ల రాకపోకలు ఉండడంతో 15 నిమిషాల పాటు రైల్వే గేటు వేశారు. దీనితో బాలిక పరిస్థితి అక్కడే విషమించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. అక్కడ రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులు కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. దీనితో అక్కడ రైల్వే గేటు పెద్ద సమస్యగా మారింది. వంతెన నిర్మాణం సకాలంలో పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందనీ, వంతెన పూర్తయ్యి ఉంటే బాలిక బతికుండేది కావచ్చునే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

కాగజ్‌నగర్‌లో ఇప్పటి వరకు చేపట్టని భవన నిర్మాణం

వాస్తవానికి ఈ కళాశాల కాగజ్‌నగర్‌కు చెందినది. ఇక్కడ భవనం లేకపోవడంతో దీనిని సిర్పూరు (టి)కి తరలించారు. ఇదే కళాశాల కాగజ్‌నగర్‌లో ఉండి ఉంటే బాలిక పరిస్థితి విషమించినా ఇక్కడి ప్రైవేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందేది. 2016లో ప్రభుత్వం ఈ రెసిడెన్సియల్ పాఠశాలను మంజూరు చేసింది. అప్పట్లో మండలంలోని గన్నారంలో ఏడెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. అప్పట్లోనే భవన నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. కాని ఇప్పటి వరకు నిర్మాణ పనులు చేపట్టలేదంటే పాలకుల నిర్లక్ష్యం ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో 75 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ పాఠశాలలో గతేడాది నుండి ఇంటర్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం 500కు పైగా విద్యార్థులు ఈ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ఈ కళాశాలకు సిర్పూరు (టి) మండలకేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పై భాగంలో తొమ్మిది గదులను కేటాయించారు. ఈ గదులలోనే ఉదయం తరగతులు, రాత్రి అందులోనే విద్యార్థులు పడుకోవడం చేస్తున్నారు. తొమ్మిది గదులలో 500కుపైగా విద్యార్థులు వసతి చేయడమంటే ఆ విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక స్టేషన్ ఆఫీసర్ శివాజీ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పరిష్కరించుకొని ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, పలు అపార్ట్‌మెంట్‌లలో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికునికి చేయూత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు బడే అశోక్‌కు వసుధ ఫౌండేషన్ చేయూతనందించింది. సెంట్రింగ్ మేస్త్రీగా పని చేస్తున్న అశోక్ ఇటీవల ఇంటి నిర్మాణంలో భాగంగా సెంట్రింగ్ ప్లేట్లను అమరుస్తుండగా ఒక్కసారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన రెండు చేతులు విరిగిపోయాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కార్మికుడు అశోక్‌కు వసుధ ఫౌండేషన్ సభ్యులు రూ.7వేల చెక్కును ఆదివారం విరాళంగా అందజేసి తమ ఉదారతలు చాటుకున్నారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, భూపతిరెడ్డిలు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం సభ్యులకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని చాంద(టి) గ్రామంలో ఆదివారం అంబేద్కర్ యువజన సంక్షేమ సంఘ భవనంలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు చిక్కల దత్తు అంబేద్కర్ యువజన సంక్షేమ సంఘం చాంద(టి) నూతన కార్యవర్గ సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చిక్కాల దత్తు మాట్లాడుతూ సంఘ నాయకులు కలిసి కట్టుగా ఐక్యమత్యంతో ముందుకెళ్లాని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పోతరాజు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు షిండే అనిల్, తారుడి శంకర్, ప్రధాన కార్యదర్శి బొజ్జ శ్రీకాంత్, సభ్యులు రెంజర్ల రాజు, భగత్ సాయి, బొజ్జ సాయి, సాకిపెల్లి రాకేష్, మునేశ్వర్ అశోక్, రెంజర్ల సిద్దు, తారుడి ప్రవీణ్, భగత్ ప్రశాంత్, తారుడి అభిలాష్, బొజ్జ రాకేష్, బొజ్జ సురేష్, తారుడి అనిల్, రెంజర్ల సాయికృష్ణ, బొజ్జ సాయికృష్ణ, సాకిపెల్లి నందు, బొజ్జ గణేష్, తారుడి హనుమంతు, సాకిపెల్లి దేవన్న, సాకిపెల్లి వెంకటేష్, బొజ్జ అడెల్లు, దుమాల అశోక్, బిక్కి దేవిదాస్, భగత్ విఠల్ పాల్గొన్నారు.

దివ్యశ్రీ ఫౌండేషన్ అధ్వర్యంలో పెళ్లికి నిత్యావసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-నార్నూర్

జైనూర్ మండలంలోని పొచ్చంలోద్ది గ్రామానికి చెందిన తూర్పుబాయి సీతారాం దంపతుల కుమారుడు నగేష్, నార్నూర్ మండలంలోని బేత్తల్ గూడకు చెందిన బొజ్జుబాయి సీతారాం దంపతుల కుమార్తె సౌజన్య వధూవరుల వివాహములకు దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ సహకారంతో ఫౌండేషన్ వైస్ చైర్మెన్ ఆత్రం భీంరావ్ ఆదివారం జైనూర్‌లో బియ్యం, పప్పు, నూనె, తదితర నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మెన్ మాట్లాడుతూ పేదల కుటుంబానికి ఫౌండేషన్ ద్వారా చైర్మెన్ ప్రవీణ్ నాయక్ సహకారంతో అన్నిరకాలుగా ఆదుకుంటామని పేర్కొన్నారు. సరుకులు అందించిన వారిలో ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

ఎమ్మెల్యే కృషితో లిఫ్ట్‌ఇరిగేషన్ నీటి విడుదల



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలం డోంగూర్గం, చాక్‌పెల్లి, అర్లి గ్రామాల రైతులు కొద్ది రోజుల కింద లిఫ్ట్ ఇరిగేషన్ నీరు సరిగా రావడం లేదని, పంట చివరి దశలో ఉన్నందున నీళ్ల సరిపోవటం లేదని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే వారి వినతిని స్వీకరించి త్వరలోనే మీ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఆదివారం డోంగూర్గం ఎత్తి పోతకాల పథకం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తాత్కాలికంగా నీళ్ల విడుదల చేశారు. చాక్‌పల్లి గ్రామ పంచాయతీలోని ఓల్డ్ డోంగూర్గం, న్యూ డోంగూర్గం, అర్లి, చాక్‌పెల్లి గ్రామాలలోని పంట పొలాలకు ఎమ్మెల్యే కృషితో సుమారు 400 ఎకరాలకు నీరు అందిచటం జరుగుతుందని అన్నారు. అందుకు ఆ గ్రామాల రైతులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తూర్పటి వెంకటేష్, చాక్‌పెల్లి మాజీ సర్పంచ్ ఖాదిర్, డోంగూర్గం గ్రామ బీఆర్ఎస్ నాయకులు సంతోష్, రైతులు పాల్గొన్నారు.

లక్కీ డ్రాతో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వచ్చే విద్యా సంవత్సరం (2023-24)లో హైదరాబాద్ పబ్లిక్ పాఠశాల (రామంతాపూర్)లో ఒకటో తరగతిలో లక్కీ డ్రాతో ప్రవేశం పొందడానికి ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని దళిత అభివృద్ధి శాఖ జిల్లా అధికారి సునీత ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 సాయంత్రం 5 గంటల్లోగా కుల, ఆదాయ, నివాస, జనన ధృవపత్రాలు, ఆధార్, రేషన్ కార్డుల, జిరాక్స్ పత్రాలను జతచేసి రెండు పాస్ ఫొటోలతో జిల్లా కేంద్రంలోని దళిత అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 6281510601 నెంబరును సంప్రదించాలన్నారు.

వసతి గృహాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని బీజేపీ అధినాయకత్వం ఆదేశాల మేరకు మండల బీజేపీ నాయకులు 19 కార్యక్రమాలను చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు అందించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పీసరి శైలేశ్వర్ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి, యువతకు దిక్సూచి అయ్యాడని, విద్యార్థులందరూ అంబేద్కర్‌ని స్ఫూర్తిగా తీసుకొని చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ జిల్లా మోర్చా నాయకుడు ఉంగరాల రాజు, సర్పంచ్ విరేష్ కుమార్, బీజేపీ ప్రదాన కార్యదర్శి ముత్యం, బీఆర్ఎస్ నాయకులు హరీష్ చంద్రకాంత్, ముస్కు సాయి రెడ్డి, సాయి, లక్ష్మణ్, సాయిరాం, సంతోష్, టీకాజీ, సూర్య, రామ్ సింగ్, ఇంద్రకాంత్, రమేష్, పండరి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు
- టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సెమినార్



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.స్వామి అధ్యక్షతన భారత రాజ్యాంగం పరిరక్షణ- మన కర్తవ్యం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన స్కైలాబ్‌బాబు రాజ్యాంగ పరిరక్షణ ఆవశ్యకతపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంతోనే సామాజిక న్యాయం లభిస్తుందని తెలిపారు. దేశంలో రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ తరుణంలో



రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కీలకంగా మారిందని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఇలాంటి చర్చలు జరగాల్సిన అవసరం ఉందని వివరించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన సెక్యూలరిజం, సామాజిక న్యాయం వంటి వాటికి విఘాతం కలుగుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో అనేక చోట్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందన్నారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అశోక్, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వృకోధర్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు సోగాల సుదర్శన్, టీఎస్‌పీటీఏ జిల్లా అధ్యక్షుడు ఎండీ.రియాజ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జితేందర్, రెంజర్ల ప్రవీణ్, టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి పూసం సచిన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

- జయంతి ఉత్సవాల్లో అల్లరర్ల కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని, చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఉమేందర్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ఇటీవల అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా జరిగిన గొడవకు సంబంధించి కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 14న పట్టణంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయని కానీ జయంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో భాగంగా అల్లరిమూకలు పిట్టలవాడ కాలానికి చెందిన సాయికిరణ్ అనే యువకుడిపై దాడి చేశారని, బాధితుని ఫిర్యాదు మేరకు ఐదుగురిని అదుపులోకి తీసుకుని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే ఉత్సవాలను భగ్నం చేసేందుకు కుట్ర జరిగిందని, దీనిపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అప్పటివరకు సంయమనం పాటించాలని సూచించారు.

నేటి బంద్‌ను అడ్డుకుంటాం

అలాగే ఈ నెల 17న సోమవారం పట్టణంలో హిందూ వాహిని శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న బంద్‌కు ఎలాంటి అనుమతిలేదని, బంద్‌ను జరగనివ్వమని, బంద్‌లో చట్టాన్ని ఎవరైతే అతిక్రమిస్తారో వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. అవసరమైన కేసులు నమోదు చేస్తామని వినకుంటే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని అన్నారు. శనివారం రిమ్స్ ఎదుట ఆందోళన చేపట్టి ప్రయాణికులకు రోగులకు అంబులెన్స్‌కు ఆర్టీసీ బస్సులు అందరికి ఇబ్బందులు కలిగించినందుకు కేసులు పెట్టామని ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ పురుషోత్తంచారి, రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ రఘుపతి ఉన్నారు.

21వ రోజుకు చేరిన రైతు పోరాటం



నవతెలంగాణ-నిర్మల్

లోకేశ్వరం మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన దళిత రైతు కొబ్బనోళ్ల గంగన్న నిరవధిక ధర్నా ఆదివారం 21వ రోజుకు చేరుకుంది. న్యాయం చేయాలని నోరు మూసుకుని నిరసన తెలిపారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ మద్దత్తు తెలిపి మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, అందరికీ దరఖాస్తులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఏమాత్రం స్పందించడం లేదన్నారు. కలెక్టర్ ఆలోచిస్తున్నాం, వారం రోజుల్లో విచారణ చేస్తామని చెప్పారని అన్నారు. కానీ ఇంకా ఎటువంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. 21 రోజులుగా కలెక్టర్ కార్యాలయం ముందు నిరవధిక ధర్నా నిర్వహిస్తుంటే కలెక్టర్ ఏ మాత్రం స్పందించడం లేదని విమర్శించారు. జిల్లా కేంద్రంలో ఉన్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అంబేద్కర్ జయంతి రోజు దరఖాస్తు తీసుకొని కలెక్టర్‌కి ఇచ్చారని, అయిన ఫలితం లేకపోయిందన్నారు. గ్రామ సర్పంచ్, వీడీసీ సభ్యులు ఆ గ్రామ ప్రజలను వెంటేసుకొని, 33 సంవత్సరాలుగా సాగులో ఉన్న పట్టా భూమిని కబ్జా చేసి, అక్రమంగా వీడీసీ భవనం నిర్మించి, దళిత రైతు కుటుంబంపై దాడి చేసి, కులం పేరుతో దూషించి, నానా ఇబ్బంది పెడితే, అధికార యంత్రాంగం కదలట్లేదన్నారు. వెంటనే బాధిత దళిత రైతుకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామలక్ష్మణ్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తోడసం శంభు, బాధిత రైతు కుటుంబం కొబ్బనోళ్ల గంగన్న, నవీన్, హంసబాయి పాల్గొన్నారు.

మతోన్మాదుల కుట్రలో యువత బలి పశువులు కావొద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మతోన్మాదులు పన్నిన కుట్రలో పాల్గొని, యువత బలి పశువులు కావొద్దని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఇటీవల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ, అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు అట్టహాసంగా విజయవంతం అయ్యాయని తెలిపారు. కాగా ఉత్సవ కమిటీ అన్ని పక్షాలను ఏకం చేస్తూ కనివిని ఎరుగని రీతిలో కార్యక్రమాలను జరిపిస్తే దాన్ని జీర్ణించుకోలేని కొన్ని దుష్టశక్తులు అల్లర్లకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. 13న అంబేద్కర్ విగ్రహావిష్కరణ, 14న జయంతి ఉత్సవాలలో ప్రజలు స్వచ్ఛందంగా వేలాదిగా పాల్గొన్నారని తెలిపారు. తొలిసారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం కావడంతో దాన్ని జీవించుకోలేకే మతోన్మాద శక్తులు కుట్రలకు తెర లేపారని మండిపడ్డారు. పైగా కుట్రలో భాగంగా ఏకంగా శివాజీనే వాడుకుని కుటిల నీతి రాజకీయాలను చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. మతోన్మాదులు పన్నిన కుట్రలో యువత బలిపశువులు కావొద్దని, అల్లర్లలో చిక్కుకుని తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని కోరారు. అల్లర్లకు కారకులైన బాధ్యులను వెంటనే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖను విజ్ఞప్తి చేశారు. ఇదే అదునుగా సదరు అవకాశాన్ని పావుగా ఉపయోగించుకొని రాజకీయ లబ్దిపొందే శక్తుల పట్ల యువత జాగ్రత్త వహించాలని హితవు పలికారు. ఎప్పుడూ అల్లర్లలో బలయ్యేది సామాన్య ప్రజలు, కార్యకర్తలేనని, ఏ ఒక్క నాయకుడు కాదన్న విషయాన్ని యువత గుర్తించాలని సూచించారు. ఆదిలాబాద్ పట్టణం శాంతికి కేంద్రమని ఈ ఏడాది ఎన్నికల ఏడాది కావడంతో అవకాశ వాద రాజకీయాలకు ఎక్కువ అవకాశం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శాంతి, భద్రతలను కాపాడటం కోసం ప్రభుత్వం వాటికి విఘాతం కలిగించే శక్తులపట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

అడెల్లి పోచమ్మను దర్శించుకున్న ప్రముఖులు

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహా పోచమ్మ ఆలయాన్ని ఆదివారం ప్రముఖులు దర్శించుకున్నారు. విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, నిర్మల్ డీఈఓ రవీందర్‌రెడ్డి, భోజన్న, సూపరింటెండెంట్, నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు, అదిలాబాద్ జిల్లా అటవీ శాఖాధికారి పిట్ల రాజశేఖర్‌లు అమ్మవారిని దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు పలువురిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ సీనియర్ అసిస్టెంట్ రమణరావు, ఆలయ ధర్మకర్తలు పురుషోత్తంరావు, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

బైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా అల్జాపూర్ సుధాకర్‌రావు నియామకం

నవతెలంగాణ-బాసర



బైంసా మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ పాలకవర్గంలో బాసర మండల కేంద్రానికి చెందిన అల్జాపూర్ సుధాకర్‌రావు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకమయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుధాకర్‌రావు మాట్లాడుతూ ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సహకారంతో రైతులకు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమకమైన సుధాకర్‌రావును ఎంపీపీ సునీత విశ్వనాథ పటేల్, సర్పంచ్ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఓని నర్సింగ్‌రావు సత్కరించారు.

ఎడ్ల బండిపై చిరుత దాడి

- రైతులు కేకలు వేయడంతో పారిపోయిన చిరుత
- బెదిరిన ఎడ్లు స్వల్ప గాయాలతో బయట పడ్డ మూగ రైతు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

కుంటాల మండలంలోని సూర్యపూర్ గ్రామం పిర్ల గుట్ట అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఎడ్ల బండిపై చిరుతపులి దాడికి యత్నించింది. గ్రామానికి చెందిన మూగ రైతు రోడ్డ శ్రీనివాస్, మరో ఇద్దరు రైతులతో కలిసి అటవీ ప్రాంతం నుంచి పబ్బు తీసుకరావడానికి ఎడ్ల బండిపై వెళ్లారు. అక్కడ ఇద్దరు రైతులు పబ్బు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్లగా, మూగ రైతు రోడ్డు శ్రీనివాస్ ఎడ్ల బండిపై ముందు ప్రాంతానికి వెళ్లాడు. అయితే అక్కడ ఉన్న చిరుత పులి ఎద్దుల పైకి దాడికి పాల్పడింది. ఎద్దులు బెదరడంతో పాటు మూగ రైతు శ్రీనివాస్ వచ్చి రాని మాటలతో కేకలు వేశాడు. ఇది గమనించిన ఇద్దరు రైతులు ఎడ్ల బండి వైపు పరుగున రావడంతో చూసిన చిరుత పులి అక్కడి నుంచి పారిపోయింది. ఎద్దులు బెదరిన నేపథ్యంలో బండి అటు ఇటు కదలడంతోపైన కూర్చున్న మూగ రైతు శ్రీనివాస్ కింద పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. సంబంధిత సమాచారం అందుకున్న ఎఫ్‌బీఓ హరిలత ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్సెస్)లో తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ గజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లాస్థాయి ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా దాగిరి దయాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ముమ్మడి నర్సింగ్‌రావులు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ఆయా కళాశాలల యూనిట్ బాధ్యులు పాల్గొన్నారు. ఎన్నికైన జిల్లా బాధ్యులకు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సంగీత, ఆర్ సంతోష్ కుమార్, కె రఘునాథ్, టి ప్రతాప్‌సింగ్, కె రమేష్‌రెడ్డి, డాక్టర్ సంతోష్ కుమార్, జె. విజయ్ కుమార్, జె. తిరుపతి, ప్రభాత్‌రావు, ఎం.స్వామి, జి.చంద్రశేఖర్, ముజీబ్‌లు అభినందనలు తెలిపారు. రాష్ట్ర సంఘ ఎన్నికలు ఈ నెల 30న హైదరాబాద్‌లో జరగనున్నట్టు తెలిపారు.

గెల్లు శ్రీనివాస్‌కి టీటీడీసీ చైర్మెన్‌గా అవకాశం ఇవ్వడం అభినందనీయం



నవతెలంగాణ-ఉట్నూర్

ఉద్యమకారుడు, స్వరాష్ట్రంలో మలిదశ ఉద్యమాలలో పోరాడిన ఉద్యమవీరుడు గెల్లు శ్రీనివాస్‌కి రాష్ట్ర టీటీడీసీ చైర్మెన్‌గా అవకాశం ఇవ్వడం అభినందనీయమని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ అన్నారు. రాష్ట్ర పర్యాటక, అభివృద్ధి సంస్థ చైర్మెన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ధరణి రాజేష్ ఆయనను శాలువతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెల్లు శ్రీనివాస్ యాదవ్ చదువుకునే రోజుల్లో నుంచి విద్యార్థి నాయకులు ఎదిగి, రాష్ట్ర మలిదశ పోరాటాల్లో పాల్గొని ముందుండి ఉద్యమాలు చేశారని అన్నారు. శ్రీనివాస్ యాదవ్ చేసిన సేవలను టీటీడీసీ చైర్మెన్‌గా సీఎం కేసీఆర్ అవకాశం కల్పించడం పట్ల కేసీఆర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల పట్ల ఏ ప్రభుత్వం కూడా గుర్తించలేని ప్రభుత్వాలు తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత సీఎం కేసీఆర్ విద్యార్థులను గుర్తించి విద్యార్థులకు పెద్ద పీట వేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు బుట్టి శివకుమార్, జంగిలి ప్రశాంత్, సాయి, సామల రాజన్న ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-లక్షెటిపేట్



మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ముత్తే శ్రీనివాస్ గత సంవత్సరం పక్షవాతం వచ్చి మంచాన పడటంతో ఆదివారం న్యాయవాది కారుకూరి సురేందర్ రూ.5 వేలు అందజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారని విషయం తెలుసుకున్న సురేందర్ ముందుకు వచ్చి ఆస్పత్రి ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కారుకూరి ట్రస్ట్ చైర్మన్ సురేందర్, నరేందుల సురేందర్, రాచర్ల సునీల్, మోట పలుకుల కమలాకర్, కారుకూరి కిషన్ పాల్గొన్నారు.

వర్ధంతి సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-కాసిపేట



సోమగూడెంలో ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ మాజీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి అమరజీవి మహమ్మద్ గౌస్ ద్వితీయ వర్ధంతి సభ, స్థూపావిష్కరణ పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహమ్మద్ గౌస్ జన్మస్థలం కొత్తూరు వరంగల్ జిల్లాలో 51 ఫీట్ల స్థూపావిష్కరణ, రెండవ వర్ధంతి బహిరంగ సభను ఈనెల 19న నిర్వహిస్తున్నామని, ఈ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్బని రాజేంద్రప్రసాద్, రాజశేఖర్, ప్రదీప్ పాల్గొన్నారు.

పాలకులారా.. కాస్త కళ్లు తెరవండి..!

- జిల్లాలో ఇప్పటికే ఆరుగురు విద్యార్థులు మృత్యువాత
- అయినా పట్టింపులేని పాలకులు, అధికారులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ రెండు సంఘటనలే కాదు. గతేడాది ఆగష్టు నుండి ఇప్పటి వరకు ఆరుగురు విద్యార్థులు మృతి చెందారు. అయినా అటు పాలకులలో కాని, ఇటు అధికారులలో కాని ఎలాంటి చలనం లేదు. కేవలం సంఘటన జరిగిన సమయంలోనే హడావుడి చేయడమే తప్ప శాశ్వత చర్యలు తీసుకోవడం లేదు. బాధితుల తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టడం, మధ్యవర్తులు రావడం, మధ్యవర్తిత్వం చేయడం, ఎంతో కొంత నష్టపరిహారం కింద ఇప్పించడం, మృతదేహాలను తరలించి చేతులు దులుపుకోవడానికే అటు అధికారులు, ఇటు పాలకులు పరిమితమవుతున్నారు. ఈ రెండు ఘటనలలో కూడా ఇదే జరిగింది. కస్తూర్బా ఘటనలో మృతురాలి బంధువులు చేపట్టిన ఆందోళనతో స్పెషల్ అధికారి స్వప్నతో పాటు డ్యూటీ డాక్టర్, ఏఎన్ఎంలను సస్పెండ్ చేశారు. కుటుంబసభ్యులలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇస్తూ తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 50 వేలు అందించారు. సిర్పూరు ఘటనలో హౌజ్ మేడమ్ మమతను విధుల నుండి తొలగించారు. కుటుంబసభ్యులలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఇవే కాకుండా జిల్లాలో దీనికి ముందు పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థి ఆలం రాజేష్, సిర్పూరు (టి) గురుకుల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని అశ్విని, తిర్యాణి మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ వసతిగృహంలో ఐదో తరగతి విద్యార్థి టేకం రమేష్, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని లావుడ్య సంగీత మృతి చెందింది.

కానరాని శాశ్వత చర్యలు

వసతిగృహాలు, గురుకులాలో వరుసగా విద్యార్థులు మృతి చెందుతున్నా అధికారులు మాత్రం శాశ్వత చర్యలు తీసుకోవడం లేదు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ పాలకులు సైతం చోద్యం చూస్తున్నారే తప్ప అధికారులపై అజమాయిషీ లేదు. పైరవీలతో అధికారులచే పనులు చేయించుకునే ఎమ్మెల్యేలు ప్రజా సమస్యల విషయంలో అధికారులపై ఆజమాయిషీ ప్రదర్శించడం ఎప్పుడో విస్మరించారు.



శ్రీవాణి మృతదేహంపై పడి రోదిస్తున్న తండ్రి సమ్మయ్య

ఈ ఫోటోలో బాలిక శ్రీవాణి (14) మృతదేహంపై పడి రోదిస్తున్నది ఆమె తండ్రి సోదరి సమ్మయ్య. నిరుపేద వ్యవసాయ కుటుంబమైన సోదరి సమ్మయ్యకు ఇద్దరు కూతుళ్లు కాగా, మృతి చెందిన శ్రీవాణి పెద్ద కూతురు. చదువులో రాణిస్తున్న శ్రీవాణి తమ వద్ద ఉంటే పెద్ద చదువులు చదివించలేమని భావించిన ఆ తల్లిదండ్రులు సిర్పూరు (టి)లోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో చదివిస్తున్నారు. శనివారం అస్వస్థతకు గురై ఆ బాలిక మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆ తల్లిదండ్రులు భోరున రోదిస్తూ కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. రోదిస్తూనే తల్లి లలిత సొమ్మసిల్లి పడిపోగా తండ్రి మాత్రమే మృతదేహం వద్ద ఇలా రోదిస్తూ కనిపించాడు.

ఫలితంగా అధికారుల నిర్లక్ష్యానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎవరు ఎక్కడ పోతే నాకేంది, పైరవీలతో నా కార్యకర్తల పనులైతే సజావుగా సాగుతున్నాయి కదా అని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ఏడెనిమిది నెలల కాలంలోనే ఒకే జిల్లాలో ఆరుగురు విద్యార్థులు మృతి చెందితే వారి మృతికి కారణమేంటి? అసలు వసతిగృహాలలో ఏం జరుగుతోంది? డ్యూటీ డాక్టర్లు, ఎఎన్ఎంలు సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నారా, వారి వద్ద మందులు అందుబాటులో ఉంటున్నాయా, అస్వస్థతకు గురైన విద్యార్థులను వెంటనే ఆసుపత్రికి తరలించకుండా తమకు తెలిసిన వైద్యం చేస్తూ ప్రాణాల మీదికి తీసుకువస్తున్నారా, హౌజ్ మాస్టర్లు ఏం చేస్తున్నారు? ప్రిన్సిపల్‌లు స్థానికంగా ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారా, అసలెక్కడ లోపముంది? అనే విషయంలో ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకొని విద్యార్థుల మరణాలను అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మృతి చెందిన ఐశ్వర్య మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి (ఫైల్‌ఫోటో)

ఈ ఫోటోలో కూతురు నగోసె ఐశ్వర్య (13) మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి పేరు నీలాబాయి. వీరిది కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ గ్రామం. నీలాబాయి-శంకర్ దంపతులకు నలుగురు కూతుర్లు, ఒక కుమారుడు కాగా, ఐశ్వర్య పెద్ద కూతురు. ప్రైవేట్‌గా చదివించే స్థోమత లేక కాగజ్‌నగర్ కస్తూర్బా పాఠశాలలో చదివిస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ ఏడో తేదీన బాలిక అస్వస్థతకు గురై మృతి చెందింది. పెద్ద కూతురు మృతి చెందిన విషయాన్ని జీర్ణించుకోని తల్లి నీలాబాయి గుండెలవిసేలా ఏడ్వడం అక్కడి వారిని కలిచివేసింది.

గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-కాసిపేట

గౌడ సంఘం మండల కార్యవర్గాన్ని ఆదివారం మండలంలోని కొండాపూర్ యాపలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మార్గ శ్రీనివాస్ గౌడ్(కాసిపేట), ప్రధాన కార్యదర్శిగా పోడేటి రాజాగౌడ్(కొండాపూర్), ఉపాధ్యక్షుడిగా భాస్కర్ గౌడ్ (దేవాపూర్), పడాల మల్లేష్‌గౌడ్(ధర్మరావుపేట), జాయింట్ సెక్రటరీగా తాటిపాముల రాజబాబుగౌడ్ (మల్కపల్లి), కోశాధికారిగా శేఖర్‌గౌడ్(వల్లంగూడెం), సలహాదారులు తాటిపాముల శంకర్‌గౌడ్, నేరెల్లి బుగ్గయ్యగౌడ్, పల్లె మల్లయ్యగౌడ్ లను ఎన్నుకున్నారు. ఈ నెల 23వ తేదీన వచ్చే ఆదివారం ఇదే స్థలంలో గౌడ సంఘ ఆత్మీయ సమ్మేళనం జరపాలని గ్రామ కమిటీలను యూత్ కమిటీని నియమించాలని నిర్ణయించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జన్నారం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ అరుణారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు సకాలంలో హజరు కావాలని, వివిధ శాఖల మండల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఆమె తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఆదర్శ పాఠశాల ప్రవేశపరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు వివరించారు. జిల్లా విద్యాధికారి అశోక్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తము 1012 విద్యార్థులకు గాను 763 విద్యార్థులు హాజరైనట్లు, మధ్యాహ్నం 7 నుండి 10వ తరగతి ప్రవేశ పరీక్షకు జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, ఈ పరీక్షా కేంద్రాల్లో ఏడవ తరగతి 262 విద్యార్థులకు 218 మంది, ఎనిమిదో తరగతిలో 216 విద్యార్థులకు 185 విద్యార్థులు, 9వ తరగతిలో ప్రవేశ పరీక్షకు 164 విద్యార్థులకు 130 విద్యార్థులు, పదవ తరగతిలో ప్రవేశం కొరకు 50 మంది విద్యార్థులకు 36 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

2023-24 విద్యా సంవత్సరానికి గాను అర్హత గల షెడ్యూల్ కులాల (ఎస్సీ) బాల బాలికల నుంచి హైదరాబాదులోని బేగంపేట పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతి ఇంగ్లీష్ మీడియంలో రెండు సీట్ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు రవీందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువత అన్ని రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ సూచించారు. తిర్యాణి మండల కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాజి అనిల్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ యువ సైన్యం ఆధ్వర్యంలో క్రీడాకారులకు టీ షర్ట్ లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు స్నేహభావంతో క్రీడలను నిర్వహించుకోవాలని తెలిపారు. మారుమూల ప్రాంతమైన తిర్యాని మండలంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, చరణ్, నాయకులు జుమ్మిడి కిష్టయ్య, పెరుమండ్ల వెంకన్న, యువజన అధ్యక్షులు పున్నం కుమార్, ఉపాధ్యక్షులు పులిశెట్టి రాజు, చుంచు భీమయ్య, బుద్దె చిన్నయ్య బొక్కనపల్లి మునీశ్వర్, యువజన నాయకులు రాజు, బొల్లం సురేష్, కిషన్ గౌడ్, సురేందర్, ఎర్రం తిరుపతి పాల్గొన్నారు.

నూతన కార్యర్గం ఎన్నిక



నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ మేజర్ గ్రామ పంచాయతీ కార్మికుల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా మారుతి, ప్రధాన కార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా దివాకర్, సహాయ కార్యదర్శిగా రాజమల్లు, నగేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించుకునేందుకు అందరు సహకరించాలన్నారు.

కేంద్ర రవాణా శాఖమంత్రికి వినతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట్



ఎన్ హెచ్ -63 ఫోర్ లేన్ రహదారిని పాత రూట్ మ్యాప్ ప్రకారమే విస్తరించాలని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారిని ఆదివారం లక్షెట్టిపేటకు చెందిన పలువురు బాధితులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్ఎఐ ఆర్వోకి ఇటీవల వినతి పత్రం అందజేసిన బాధితులు తాజాగా నాగపూర్‌కు వెళ్లి తమగోడును ఆయనకు విన్నవించుకున్నారు. లక్షెట్టిపేట మీదుగా మంచిర్యాల వరకు కొత్త రూట్ మ్యాప్‌తో ఫోర్ లేన్ రహదారిని విస్తరిస్తే భారీగా నివాస గృహాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు కోల్పోవడమే కాకుండా, విలువైన వ్యవసాయ భూములు లేకుండా చాలా మంది నష్టపోతారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పట్టణాలను, గ్రామాలను తప్పిస్తూ పాత రూట్ మ్యాప్ ప్రకారం బైపాస్ లతో రహదారిని విస్తరించడం వల్ల ఆస్తి నష్టం తక్కువగా ఉంటుందని విన్నవించారు. కాగా, తమ వినతిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని బాధితులు పేర్కొన్నారు.



హాజీపూర్ : జాతీయ రహదారి 63 విస్తరణలో బాగంగా ఇండ్లు, భూములు కోల్పోతున్న హాజీపూర్ మండల బాధితులు ఆదివారం మహారాష్ట్ర నాగపూర్‌లో కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీనీ కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్డు రెండు వైపులా సమానంగా బుసేకరణ జరపాలని, ప్రస్తుత మార్కెట్ ధరలు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కేంద్ర మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో పుస్కూరి శ్రీనివాస్ రావు, లగిషెట్టి రాజయ్య, కందుల రమేష్ పాల్గొన్నారు.

సంతానం కలగలేదని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-సిర్పూర్(టి)



సంతానం కలగడంలేదని నవెగాం గ్రామానికి చెందిన కుత్తరమారె ఉషా(28) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ సాదిక్‌పాషా, ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. ఆదివారం పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కౌటాల మండలం గుండాయిపేట్ గ్రామానికి చెందిన కుల్మె దేవాజీ చిన్న కూతురు ఉషాకు సిర్పూర్ మండలం నవెగాం గ్రామానికి చెందిన కుత్తరమారె పరశురాంకు 20118 సంవత్సరంలో ఇచ్చి వివాహం చేశారు. ఐదేండ్లు గడిచిన సంతానం కలగలేదని జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి భర్తతో భోజనం చేసి, కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా ఇంటిలో దూలానికి తాడుతో ఉరివేసుకుంది. భర్తకు మెలుకువ రావడంతో లేచి చూసేసరికి ఉరివేసుకొని వేలాడుతుండగా గమనించి వెంటనే క్రిందికి దించాడు. అప్పటికే మృతిచెందింది. తల్లిదండ్రులతో సంతానం కలగలేదని ఎన్నోసార్లు వారికి తెలిపి బాధపడుతుండేదని, భర్త దేవాజీ సంతానం కోసం ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్టు వారు తెలిపారు. తండ్రి దేవాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు పోలీసులు తెలిపారు.

పార్ట్ టైం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- నేడు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలి
- సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి



నవతెలంగాణ-కెరమెరి

జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పని చేస్తున్న హాస్టల్, డెలివైజ్, ఔట్ సోర్సింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. ఆదివారం మండలంలోని హట్టి గిరిజన ఆశ్రమ బాలుర పాటశాల వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత కొన్నేళ్లుగా వివిధ వసతి గృహాల్లో, ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్నప్పటికి నేటికి సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు. అవుట్ సోర్సింగ్ పేరుతో రోజంతా పని చేయించుకుంటూ, చాలీ చాలని వేతనాలు చెల్లించడం సరి కాదన్నారు. వీరికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇచ్చే అరకొర వేతనాలు ప్రతి నెల అందక కుటుంబ పోషణకు బారమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్ట్ టైం వర్కర్లు, వసతి గృహాల్లో పని చేసే రోజు వారీ కూలీల సమస్యలు పరిష్కారానికి ఈ నెల17న జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నా కార్యక్రామాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్ ఉన్నారు. వర్కర్లు పుష్ప, సీతారాం, లక్ష్మణ్, కె.రాంచందర్, కర్ను పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి పెన్‌గంగలో పడి మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ మండలం హుడ్కిళి గ్రామానికి చెందిన చౌదరి కైలాశ్(20) అనే వ్యక్తి మతిస్థిమితం లేక హుడ్కిళి గ్రామ శివారులో గల పెన్‌గంగలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్టు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. ఆదివారం పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరి కైలాశ్ గత కొన్ని సంవత్సరాల నుండి మతిస్థిమితం కోల్పోయి మూర్చవ్యాధితో బాధపడుతున్నాడని, శనివారం పెన్‌గంగ శివారు ప్రాంతంలో గల తన చేనుకు మధ్యాహ్నం మూడు గంటలకు వెళ్లి దాహం వేయడంతో నదిలోని నీరు తాగడానికి వెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడని ఎస్సైపేర్కొన్నారు. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో గ్రామంలో, తన చేను ప్రాంతంలో వెతుకుతుండగా ఆదివారం ఉదయం నది ఒడ్డుపై చెప్పులు కనిపించడంతో, మధ్యాహ్నం 12 గంటల సమయంలో మృతుడి పెదనాన్న చౌదరి వసంత్ నదిలో తేలియాడుతున్నకైలాశ్ మృతదేమాన్ని గమనించి మృతుడి తండ్రికి సమాచారం అందించారు. వెంటనే పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో పెన్‌గంగ నదిలో నుంచి మృతదేహాన్ని బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం సిర్పూర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి చౌదరి ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు తెలిపారు.

'బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు'

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

నవతెలంగాణ-మంచిర్యాల



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఆదర్శవంతమైన పాలన సాగుతోందని తమ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని స్థానిక ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల నుండి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. వివిధ వార్డుల నుండి నాయకులు ర్యాలీలుగా వచ్చారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ బహిరంగ సభలో నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యస్పదంగా ఉందన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్‌రావు బ్యాంకులకు డబ్బులు ఎగ్గొట్టిన నాయకుడు అని అలాంటి నాయకుని ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దౌర్జన్య రాజకీయాలకు పెట్టిన పేరు కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు అని ఆరోపించారు. అవినీతి సొమ్ముతో చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గు చేటని వ్యాఖ్యానించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్న విషయాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి నారదాసు లక్ష్మణరావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేష్, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి నీట మునిగి బాలుడు మృతి

నవతెలంగాణ-జన్నారం



ఈతకు వెళ్లి నీట మునిగి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని తపాలాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకివెలితే.. తపాలపురం గ్రామానికి చెందిన, ముటికే గోపాల్, మమతల కుమారుడు ముటికే మౌర్య తేజ(14) తన నలుగురు స్నేహితులతో కలిసి గ్రామం పక్కనే ఉన్న వాగులో ఉన్న పెద్ద బావిలో ఈతకు వెళ్లారు. మౌర్య తేజకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందినట్లు స్థానికలు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదశాలు అమ్ముకున్నాయి. గోపాల్ ఇంటి కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది. స్థానిక ఏఎస్సై తానాజీనాయక్ సంఘటన స్థలానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి శవ పంచానామాకు పంపినట్లు తెలిపారు.

బైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా రాజేష్‌బాబు

నవతెలంగాణ-భైంసా





బైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ లోకేశ్వరం మండలంలోని రాజేష్ తండాకు చెందిన రాజేష్‌బాబును నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా వైస్ చైర్మెన్‌గా సుదర్శన్ పటేల్ నియామకమయ్యారు. డైరెక్టర్‌లు గా ఎండీ సిరాజుద్దీన్, తోట రాము, రౌతు రాజేశ్వర్, పి.రాజారెడ్డి, కానమొల్ల రాజేశ్వర్, గంగాధర్, సాయన్న, దిగంబర్ పటేల్, దేవిదాస్, గంగామణి, సుధాకర్‌రావు, బి.నగేష్‌లను నియమిస్తున్నట్లు వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మెన్‌గా నియమితులైన రాజేష్‌బాబు ఉద్యమ కాలం నుండి ఆయన బీఆర్‌ఎస్‌లో కొనసాగుతూ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. త్వరలోనే వీరు పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.

జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మెన్‌కు సన్మానం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మెన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ను ఆదివారం మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో బీజేపీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబుతో పాటు ఆరె కుల సంక్షేమ సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆరె సంఘం నాయకులు చనకపురె శంకర్, ఎల్ములె శంకర్, లోనారె రవీందర్, చౌదరి సుభాష్, భగవాన్, లచ్చన్న చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దళిత వ్యతిరేకి ఎమ్మెల్యే వైఖరిని ఎండగట్టాలి

- పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అవలంబిస్తున్న దళిత వ్యతిరేక వైఖరిని వ్యతిరేకించాలని బీజేపీ సిర్పూరు నియోజకవర్గ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిర్పూరు(టి) గురుకుల కళాశాలకు చెందిన దళిత విద్యార్థిని శ్రీవాణి మృతి చెందితే ఎమ్మెల్యే అందుబాటులో ఉండీ కూడా ఆ బాలిక కుటుంబాన్ని పరామర్శించకపోవడం దారుణమని అన్నారు. అధికారపార్టీ నాయకులు ఎవరూ కూడా ఆస్పత్రి వైపు కన్నెత్తి చూడలేదని అన్నారు. అంబేద్కర్ జయంతి మరుసటి రోజే ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమని అన్నారు. జయంతి సందర్భంగా ఫ్లెక్సీలలో ఫోటోలు వేసుకోవడం మాని దళితుల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్, అరుణ్ లోయ, వీరభద్రచారి, మాచర్ల శ్రీనివాస్, ముత్తు అశోక్, జాడి దీపక్, రమేష్, అర్జున్, సౌరభ్ ధాత్రక్, నరేష్ పాల్గొన్నారు.

నేడు ఆదిలాబాద్ పట్టణం బందుకు పిలుపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో ఈనెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఒక ర్యాలీలో హిందూ హృదయ సామ్రాట్ శివాజీ మహారాజ్ జెండాను ఒక గ్రూప్ వారు అవమానపరిచారని ఖండిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని శివాజీ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హిందు సంఘాల నాయకులు మాట్లాడుతూ హిందూ వాహిని ఆధ్వర్యంలో హిందూ సంఘాలు అన్ని కలిసి అంబేద్కర్ జయంతి ర్యాలీలో శాంతి యుతంగా పాల్గొన్న దళిత గిరిజన యువకులపై ఒక గ్రూప్ అల్లరి మూకలు అకారణంగా దాడి చేశారని, పట్టించుకోని పోలీసుల, ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సోమవారం ఆదిలాబాద్ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. బంద్‌లో దళిత, గిరిజన సంఘాలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా పాల్గొని బంద్‌ను పాటించాలని కోరారు.

వేసవి తరగతుల నిర్ణయాన్ని రద్దు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహాత్మ జ్యోతిబాపూలే విద్యాలయాల్లో రానున్న వేసవికాలంలో తరగతులు నిర్వహించడానికి తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని పీడీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, ఆడే ప్రకాష్ రావు సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. వేసవికాలం ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక వేసవి తరగతుల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే ఉపాధ్యాయులకు అండగా ఉండి నిర్ణయం రద్దయ్యే వరకు పోరాడుతామని తెలిపారు.

పాఠశాలను సందర్శించిన తుడుం దెబ్బ నాయకులు

నవతెలంగాణ-కోటపల్లి

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆదివారం తుడుం దెబ్బ నాయకులు పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో వసతులు సరిగ్గా ఉన్నయో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మెను ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నారో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తుడం దెబ్బ మండల అధ్యక్షుడు బండి రమేష్ మాట్లాడుతూ పాఠశాలలో రెగ్యులర్ వార్డెన్ లేరని వెంటనే రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని అన్నారు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని సీసీ కెమెరాలు పని చేసేలా పాఠశాల సిబ్బంది చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమస్యలను ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆత్రం మధుకర్, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు బోయిని నగేష్, కొమురెల్లి విజయ్ పాల్గొన్నారు.

స్పందించి సమస్య పరిష్కరించిన ఎంపీటీసీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమస్యపై కాలనీవాసులు ఎంపీటీసీ దృష్టికి తీసుకు వెళ్ళగానే స్పందించి సమస్య పరిష్కరించారు. వివరాల్లోకి వెళితే మండలంలోని బూరుగూడ గ్రామంలోని బీసీ కాలనీలో రోడ్డు లేకపోవడం బోర్వెల్ చుట్టూ నీరు నిలిచి దుర్గంధం వెదజల్లడంతో కాలనీవాసులు నీటిని వాడుకునే పరిస్థితి లేకుండా పోయింది. పరిస్థితిని ఎంపీటీసీ కాల్వ శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళ్ళగానే కాలనీలో సిమెంటు రహదారితోపాటు బోర్వెల్ చుట్టూ ఫ్లాట్ ఫామ్ నిర్మించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సమస్య వివరించడంతో స్పందించిన ఎంపీటీసీకి కాలనీవాసులు బాలకిషన్, వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు తుమ్మిడే భీమేష్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలో జరుగుతున్న విద్యార్థుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు తుమ్మిడే భీమేష్ అన్నారు. సిర్పూరు(టి) సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని శ్రీవాణి అనారోగ్యంతో మృతి చెందడాన్ని నిరసిస్తూ ఆదివారం స్థానిక రాజీవ్‌చౌక్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో ఆరుగురు విద్యార్థులు మృతి చెందారని, అయినా ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. సిర్పూరు(టి) ఘటనపై సమగ్ర విచారణ జరిపించి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలిక కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వసాకే సాయికుమార్, నాయకులు రాజ్‌కుమార్, నవీన్, బండయ్య, సాయికుమార్, కార్తీక్, రాకేష్, శ్రీకాంత్, నవీన్, శ్రావణ్, గణేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

అంబేద్కర్ జయంతి, విగ్రహావిష్కరణ ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఉత్సవ కమిటీ చైర్మెన్ దుర్గం శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఓ ప్రయివేట్ రెస్టారెంట్‌లో ఈ మేరకు జయంతి ఉత్సవాల విజయోత్సవ సభను నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, గౌతమ బుద్ధుడి చిత్రపటాల వద్ద ప్రత్యేక పూజలు చేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుర్గం శేఖర్ మాట్లాడుతూ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించే రీతిలో రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ, జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయని అన్నారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ ముఖ్యభూమిక పోషించారని పేర్కొన్నారు. కొందరు ఆర్థికపరంగా చేయూతనందిస్తే మరికొందరు తమ సలహాలు, సూచనలు అందించి, కార్యక్రమం జయప్రదం అయ్యేలా సహకరించారని అన్నారు. బ్రహ్మండగా ఆదిలాబాద్‌లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు జరగడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. పట్టణంలో అంబేద్కర్ అద్భుతమైన చారిత్రక దృశ్యం ఆవిష్కృతం కావడానికి తనకు సహకరించిన ఎమ్మెల్యే జోగు రామన్న, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, జిల్లా అధికార యంత్రాంగం, పాలక, ప్రతిపక్ష పార్టీల జిల్లాల అధ్యక్షులు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత, రాజకీయ, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు శైలేందర్ వాగ్మారే, దుర్వా నగేష్, శోభాబాయి, ప్రజ్ఞకుమార్ రత్న జాడే, మేకల మల్లన్న, అశోక్, చిక్కాల దత్తు, అల్లూరి భూమన్న, బాబా సాహెబ్ కాంబ్లే, శాలిక్ రావ్, దర్శనాల మల్లేష్, బండి దత్త్రాతి పాల్గొన్నారు.

బీజేపీ వైఫల్యాలను ఎండగట్టడమే సీపీఐ ఎజెండా

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీజేపీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే సీపీఐ ప్రధాన ఎజెండా అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక రామ్‌నగర్ కాలనీలో చేపట్టిన బీజేపీకి హటావో, దేశ్‌కో బచావో జాతీయ సమితి పిలుపులో భాగంగా ఇంటింటికి సీపీఐ పాదయాత్రలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. ముందుగా పార్టీ కార్యాలయంలో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పాదయాత్రలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 నుంచి మే నెల14 వరకు బీజేపీ కో హటావో దేశ్‌కో బచావో పేరుతో దేశవ్యాప్తంగా ప్రజలను నేరుగా కలుస్తున్నామని తెలిపారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశంలో వివిధ రంగాలలో జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు వివరిస్తున్నామని అన్నారు. బీజేపీ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, లౌకిక వ్యవస్థకు తూట్లు పొడుస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడిందుకే ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముడి సరుకులు ఉపయోగించుకొని సిమెంటు, కాగితం పరిశ్రమలను వెంటనే పునరుద్ధరించాలని కుప్టి ప్రాజెక్ట్ పథకాన్ని సమగ్రంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాల్లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ, గిరిజన యూనివర్సిటీ కళాశాలలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన దళితులకు దళితబంధు ఇవ్వాలని, సీసీఐ సిమెంటు పరిశ్రమను పున్ణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాస్, నళినిరెడ్డి, జిల్లా సహాయకార్యదర్శి సిర్ర దేవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేస్రం భాస్కర్, కుంటాల రాములు, చిలుక దేవిదాస్, వామన్, నాయకులు అరుణ్ కుమార్, గేడం కేశవ్, గంగారెడ్డి, ఉస్మాన్, మడవి గణేష్, గేడం పొచ్చిరాం, కే.గణేష్, పాషా, సంగీత, కృష్ణవేణి, శబనా, అమిన, కుతుబుద్దీన్ పాల్గొన్నారు.

ప్రజలను వంచన గురిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క





నవతెలంగాణ-మంచిర్యాల

ఎన్నికల హామీలను విస్మరిస్తూ మోసపూరిత సంక్షేమ పథకాలతో ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం వంచనకు గురి చేస్తోందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రం నుండి పీపుల్స్ మార్చ్ పేరుతో చేపట్టిన పాదయాత్ర నస్పూర్ మండలం గుడిపేట వరకు సాగింది. ఐబి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుండి అపూర్వ ఆదరణ ఉందని అన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ జిల్లాలో పుంజుకుందన్నారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తుందని తెలిపారు. జిల్లాలో సహజ వనరులను కాపాడకుండా అసమర్ధ పాలన సాగుతోందని ఆరోపించారు. భట్టి విక్రమార్క పాదయాత్రకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. మేదరి వాడలో జిల్లా కార్యదర్శి జంగపెల్లి బాబన్న, పాత మంచిర్యాలలో పట్టణ అధ్యక్షులు తూముల నరేష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మహిళలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు, రాష్ట్ర పీసీసీ కార్యదర్శి చెట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు పెంట రజిత పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల 2007, 2001 ఇంటర్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక చోట కలిశారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఉద్యోగ, వృత్తి రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డ వారందరు ఒక చోట కలిసి అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుని సందండి. చేశారు. అంతేకాకుండ ఒకరికొకరు యోగక్షేమాలను ఉడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యాక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, ఉపేందర్‌రెడ్డి, దేవేందర్, లింగన్న, కృష్ణ, ప్రభాకర్, గంగాసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని హర్కాపూర్ తండా ఉపసర్పంచ్ రాథోడ్ రాధిక సంజీవ్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక జామా మసీదులో హర్కాపూర్ తండ ఉపసర్పంచ్ రాథోడ్ రాధిక సంజీవ్ నాయక్ ఆధ్వర్యంలో రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వమత సారం ఒక్కటేనని, మనుషులంతా సోదర భావంతో ఉండాలని అన్నారు. ఇందులో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అంజద్, బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ షేక్ సూఫీయన్, జమాతే ఇస్లామ్ హింద్ మండలాధ్యక్షుడు అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

కంచి కామకోటి పీఠంలో బోథ్ విద్యార్థి

నవతెలంగాణ-బోథ్



కంచి కామకోటి పీఠం ఇంటిగ్రేటెడ్ పాఠశాల విద్యాభ్యాసానికి బోథ్ మండల కేంద్రానికి చెందిన నెమలికొండ సంతోష్ కుమారుడు సుజయ్ కుమార్ ఎంపికయ్యారు. ఈనెల 14 తిరుపతిలో నిర్వహించిన అర్హత పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపి ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు ఎంపికయ్యారని అన్నారు. ఎంపిక అనంతరం కంచి కామకోటి పీఠం తిరుపతిలోని ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో సీటు దక్కిందని అన్నారు. మండల కేంద్రానికి చెందిన విద్యార్థికి ఈ అవకాశం రావడం పట్ల ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్, కిషోర్ కుమార్, గ్రామస్తులు, తల్లిదండ్రులు, కృతజ్ఞతలు తెలిపారు.

21న మెగా జాబ్ మేళా

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 21న ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లోని పటేల్ గార్డెన్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. సిర్పూరు నియోజకవర్గ యువత కోసం ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని, 50కి పైగా కంపెనీలు ఐదు వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. 18 ఏండ్లు నిండి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, అనుభవం ఉన్న నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. హాజరయ్యే అభ్యర్థులు 8520871030 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు వినతిపత్రం అందజేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేలా చూడాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. దీనికి పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రావు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పత్తిపాక శ్రావణ్, ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి, కోశాధికారి దుర్గం అనిల్, నాయకులు వనమాల, రాజేష్, బాలు, పూదరి రమేష్, సంతోష్, గజానన్, రాంచందర్ పాల్గొన్నారు.

బీజేవైఎం మండలాధ్యక్షునిగా టీకానాయక్

నవతెలంగాణ-దిలావర్‌పూర్

బీజేవైఎం మండలాధ్యక్షునిగా టీకానాయక్ నియమితులయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీజేపీ పార్టీ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పీసరి శైలేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ కొండాజీ శ్రావణ్ ఆధ్వర్యంలో బీజేవైఎం మండలాధ్యక్షునిగా టీకానాయక్‌ను, గిరిజన మోర్చా అధ్యక్షునిగా రమావత్ రాంసింగ్, బీజేపీ మండల ఉపాధ్యక్షునిగా కొత్తపాటి పండరి, రాథోడ్ సూర్యలను నియమించినట్లు అధికారికంగా ప్రకటించారు.